క్లుప్తంగా

నీటి కోసం మహిళల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

రాయికల్: మండలంలోని మూటపల్లి ఎస్సీ కాలనీలో 25 రోజులుగా బోరు మోటారు కాలిపోయి తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నా.. అధికారులెవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కథలాపూర్: విద్యార్థులను పోటీ ప్రపంచానికి దీటుగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని కోరుట్ల సీఐ సురేశ్‌బాబు అన్నారు. ఆదివారం కథలాపూర్‌లో కళాధార పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేరువలో విద్యా సంస్థలు నెలకొల్పడం అభినందనీయమన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్, ఎస్సై నవీన్‌కుమార్, చైర్మన్ గడ్డం భూమారెడ్డి, డైరెక్టర్ దివాకర్‌రెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు అరికట్టాలి



నంది చౌరస్తాను పరిశీలిస్తున్న డీఎస్పీ

కోరుట్లటౌన్: రోడ్డు ప్రమాదాలు అరికట్టాలని కోరుట్ల, మేడిపెల్లి పోలీసులకు మెట్‌పెల్లి డీఎస్పీ రాములు ఆదివారం సూచించారు. సురక్షిత ప్రయాణం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాలను డీఎస్పీ రాములు సందర్శించారు. జాతీయ రహదారిపై ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలుగా గుర్తించినట్లు తెలిపారు. ప్రమాదాలు నివారించడానికి అధికారులు సమన్వయం చేసుకొని రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజల విలువైన ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్సై రాంచంద్రం, మేడిపెల్లి ఎస్సై శ్యాంరాజు పాల్గొన్నారు.

సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నర్సింగరావు

కోరుట్ల: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. కోరుట్ల వ్యవసాయ మార్కెట్‌లో రూ.30 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరిట అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో ఉపయోగంగా ఉన్నాయన్నారు. అనంతరం కోరుట్లలో నిర్వహించిన ఓ ఇఫ్తార్ విందులో జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అన్నం అనిల్, పుప్పాల ప్రభాకర్, గడ్డం వెంకటేశ్‌గౌడ్, మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, గంగాధర్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ అంజయ్య పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు

జగిత్యాలరూరల్/ సారంగాపూర్: కరీంనగర్‌లో కేటీఆర్ నిర్వహించిన సన్నాహక సమావేశానికి జగిత్యాల రూరల్, అర్బన్, సారంగాపూర్,బీర్‌పూర్ మండలాల్లోని అన్ని గ్రామాల్లోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, సారంగాపూర్, బీర్‌పూర్ మండల బిఆర్‌ఎస్ పార్టీ మండలశాఖ అధ్యక్షులు తేలు రాజు, నెరేల్ల సుమన్‌గౌడ్, సాగి సత్యంరావు, నాయకులు తరలివెళ్లారు.



మల్లన్న స్వామికి బోనాలు

కథలాపూర్: మండలంలోని ఊటిపెల్లిలో మల్లికార్జునస్వామి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఒగ్గు కళాకారులు పట్నం ముగ్గు వేసి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బోనాలతో ఊరేగింపుగా వచ్చి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



వృథాగా ఎస్సారెస్పీ నీరు

రాయికల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయం వద్దనున్న కల్వర్టులో చెత్తాచెదారం నిండి ఎస్సారెస్పీ నీరు సరఫరా కాకపోవడంతో ఆ నీరంతా పరిసర ప్రాంతాల్లోని పొలాల్లోకి వెళ్లుతోంది. దీంతో పొలాల్లో నీళ్లు నిండిపోతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు స్పందించి కల్వర్టు నుంచి నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యాభై ఏళ్ల సంబురం..

కోరుట్ల: కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో(1973–75) ఇంటర్మీడియట్ చదువుకుని వివిధ హోదాల్లో 200 కుటుంబాలు ఆదివారం కోరుట్లలో ఒక్క చోటికి చేరారు. కాలేజీలో చదువుకున్న రోజులను గుర్తుతెచ్చుకుని ఆనందంగా గడిపారు. సామూహిక భోజనాలు చేసి మరో సారి కలుద్దామని తీర్మానించుకుని ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ మేడి కిషన్, స్పాన్సర్ అడ్వకేట్ నీలగిరి శంకర్‌రావు–ప్రసూన దంపతులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఆనందంగా ఉంది



పూర్వ విద్యార్థులందరం పిల్లాపాపలతో ఒకే వేదికపై కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. పాత స్నేహితులను గుర్తుంచుకుని వివిధ ప్రాంతాల నుంచి వివిధ హోదాల్లో వారంతా రావడంతో అందరం ఉల్లాసంగా గడిపాం.

– మేడి కిషన్, డిగ్రీ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్, కోరుట్ల

మళ్లీ కలుస్తాం



చాలా రోజుల తరువాత స్నేహితులను కలిశాం. ఒక్కొక్కరు కలుస్తుంటే అప్పటి జ్ఞాపకాలు గుర్తుకువచ్చాయి. నిజంగా ఈ ఆనందం చెప్పరానిది. ప్రతీ ఒక్కరితోనూ మంచి చెడు పాలుపంచుకునే అవకాశం దక్కింది. మళ్లీ కలిసేందుకు నిర్ణయించుకున్నాం.

– నీలగిరి శంకర్‌రావు, అడ్వకేట్

హుషారు కనిపించింది



యాభై ఏళ్ల క్రితం ఉన్న హుషారు స్నేహితులను అందరినీ ఈ రోజు చూసేసరికి సంతోషం కలిగింది. ఇలాంటి సమ్మేళనాలు ఈ వయసులో మాలో ఉత్సాహాన్ని నింపుతాయి. ఈ కార్యక్రమం ఏర్పాటుకు సహకరించిన స్నేహితులకు ధన్యవాదాలు.

– సింగిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ, కోరుట్ల

దేశం కోసం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి భగత్‌సింగ్

జగిత్యాల/ జగిత్యాలటౌన్/కథలాపూర్: దేశం కోసం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి భగత్‌సింగ్ అని ఎస్‌ఎఫ్‌ఐ, భారత్ సురక్షా సమితి నాయకులు అన్నారు.స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు నాయకులు నివాళి అర్పించారు. జిల్లా కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ, భారత సురక్ష సమితి నాయకులు, కథలాపూర్ మండలం సిరికొండ, మల్లాపూర్ మండలం చిట్టాపూర్‌లో యువజన సంఘాల నాయకులు నివాళి అర్పించారు. మహనీయుల ఆశయాలను కొనసాగించాలని పలువురు నాయకులు కోరారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్



విప్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

మేడిపల్లి: మండలంలోని మాచాపూర్ శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్ రెడ్డి, సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, కుందారపు జలందర్, మాదం వినోద్, చేపూరి నాగరాజు, సాయిని గంగారెడ్డి, గడ్డం జలందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల రిక్రియేషన్ క్లబ్ సెక్రటరీగా గోపాల్‌రెడ్డి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని రిక్రియేషన్ క్లబ్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. సెక్రటరీగా ముస్కు గోపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా సామ హేమేందర్‌రెడ్డి, కోశాధికారిగా వెంకటరమణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కోరుట్ల కెమెరా క్లబ్ అధ్యక్షుడిగా సత్యనారాయణ

కోరుట్లటౌన్: కోరుట్ల కెమెరా క్లబ్ ఆత్మీయ సమ్మేళనం స్థానిక జీఎస్.గార్డెన్‌లో ఆదివారం జరిగింది. కోరుట్ల క్లబ్ నూతన అధ్యక్షుడిగా తడుక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా భారతాల నరేందర్, కోశాధికారిగా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నిర్వాహక అధ్యక్షుడు కొక్కుల మురళి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా , స్థానిక కెమెరా క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

గణేష్‌నగర్ నూతన కార్యవర్గం ఎన్నిక

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని గణేష్ నగర్ రెసిడెంట్స్ సంక్షేమ మండలి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మోటూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మధుసూదన్ రెడ్డి నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా వీరేశం

రాయికల్: ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా ఎలుగందుల వీరేశం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ సభ్యులు ఎలగందుల సత్యనారాయణ, చింత శివకుమార్, నాగమల్ల శ్రీకర్ తెలిపారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంఘ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ అధ్యక్షుడిగా మల్లేశం

రాయికల్: ఆర్‌ఎంపీ, పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా చెలిమెల మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా రొట్టె శ్రీధర్, కోశాధికారి సమీర్ ఆదివారం ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, జోనల్ అధికారి ప్రతినిధి శంకర్, డివిజన్ అధ్యక్షుడు కట్కం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి కమిషన్ ఏర్పాటు చేయాలి

జగిత్యాలటౌన్: వృద్ధుల సంరక్షణ, సంక్షేమానికి, హక్కుల పరిరక్షణ కోసం వృద్ధుల సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. నిరాధరణకు గురవుతున్న వృద్ధుల హక్కుల పరిరక్షణ, పునరావాసం, భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కమిషన్ ఏర్పాటు చేస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. 2019లో కేంద్రం వృద్ధుల సంరక్షణ చట్టంలో చేసిన సవరణలను పార్లమెంటులో ఆమోదానికి అన్ని పార్టీల ఎంపీలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షుడు పీసీ హన్మంతరెడ్డి, ఎండీ యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పూసల అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న లక్ష్మారెడ్డి

జగిత్యాలజోన్/జగిత్యాలటౌన్: అంబేడ్కర్‌ను ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో న్యాయవాదులు, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొని, తహసీల్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలన్నదే అంబేడ్కర్ ఆశయమన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బండ భాస్కర్‌రెడ్డి, తాండ్ర సురేందర్, శ్రీనివాస్ గౌడ్, నాయకులు బండ శంకర్, నకుమల్ల లక్ష్మీనారాయణ, మద్దెల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు క్షమాపణలు చెప్పాలి

మల్యాల: యాదవులను అవమానించిన తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు తక్షణమే క్షమాపణ చెప్పాలని అఖిల భారత యాదవ మహాసభ కార్యదర్శి బొబ్బిలి వెంకటస్వామి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మల్యాలలో ఆదివారం మాట్లాడారు. కరీంనగర్‌లో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి ఆత్మీయ సమ్మేళనంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ యాదవులను కించపరిచేవిధంగా మాట్లాడడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ, యాదవ కులాన్ని కించపరిచేలా మాట్లాడిన హనుమంతరావు తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

'గల్ఫ్ భరోసాను ఓర్వలేకపోతున్నాయి'

కోరుట్ల: గల్ఫ్ కార్మికుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన గల్ఫ్ భరోసాను ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని తెలంగాణ కాంగ్రెస్ గల్ఫ్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కోరుట్లలో మాట్లాడారు. గతేడాది బడ్జెట్‌లో లేకున్నా ప్రత్యేకంగా నిధులు ఇచ్చి గల్ఫ్ మృతుల కుటుంబాలను రూ. 5 లక్షలు ఇచ్చి ఆదుకున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డిది అన్నారు. కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించలేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు తర్వాత ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని తెలిపారు.





పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోరుట్లటౌన్: కోరుట్ల మండలం మోహన్‌రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరం పదో తరగతి చదువు పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వెంకటాపూర్ గుట్ట వద్ద ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను సన్మానించారు. ఆటా పాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి జెడ్పీ హైస్కూల్‌లో 2014–15 విద్యాసంవత్సరం పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థుల సమావేశం ఆదివారం జరిగింది. అప్పట్లో పాఠాలు చెప్పిన గురువులను వేదికపైకి ఆహ్వానించి వారి సేవలను కొనియాడి శాలువాలతో సన్మానించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.సామూహికంగా భోజనాలు చేసి, ఒకరికొకరు ఆటోగ్రాఫ్ తీసుకొని మళ్లీ కలుద్దాం మిత్రమా అంటూ సమావేశాన్ని ముగించేశారు.



జగిత్యాలటౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో రోడ్లపైన, పబ్లిక్ ప్లేసుల్లో ప్రైవేట్ వ్యక్తులు బోర్లు వేస్తున్నా బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదు. వినాయకనగర్‌లోని ఎస్సారెస్పీ భూమిలో బోరు వేసి అపార్టుమెంట్ అవసరాల కోసం నీటిని వినియోగిస్తున్నా అడిగే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే ధరూర్ క్యాంపులోని ఓ ఇంటి యజమాని క్రీడాప్రాంగణ స్థలంలో, హౌజింగ్ బోర్డులోని ఓ ఇంటి యజమాని ఏకంగా రోడ్డుపైనే బోరు వేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విశేషం. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి పబ్లిక్ ప్లేసుల్లో ప్రైవేట్ బోర్లను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: స్పందన
మున్సిపల్ కమిషనర్, జగిత్యాల బల్దియా, సెల్‌ఫోన్ నంబర్: 9849905877

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకం

• ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



బైక్ ర్యాలీలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్/గొల్లపల్లి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మక నిర్ణయాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం ఎండపల్లి మండలంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కృతజ్ఞత సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కుల గణనను చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీలు ఎంతో అభివృద్ధి చెందుతారని అన్నారు. అలాగే గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ పోరాటం చేసినా, ఎంతో మంది ముఖ్యమంత్రులు మారినా అమలుకు నోచుకోని వర్గీకరణను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిది, కాంగ్రెస్ ప్రభుత్వానిదని కొనియాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శైలేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ గోపిక, నాయకులు గోపాల్‌రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, వివిధ మండలాల అధ్యక్షులు, ఎమ్మార్పీఎస్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ప్రభుత్వ విప్

ధర్మపురి: ధర్మపురిలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో ఆదివారం సాయంత్రం ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్‌కుమార్ పాల్గొన్నారు. పండుగ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మతసామరస్యం,ఆత్మీయతకు ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే, ముస్లింలు

జగిత్యాలటౌన్: మతసామరస్యం,ఆత్మీయతకు ఇఫ్తార్ విందు ప్రతీకగా నిలుస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల ఖిల్లాగడ్డ కమ్యూనిటీ హాల్, రాయల్ ఫంక్షన్ హాలులో ఆదివవారం ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం ముస్లింల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో చత్రు, తహసీలార్ రాంమోహన్, డీఎస్పీ రఘుచందర్, నాయకులు పాల్గొన్నారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేయాలి

జగిత్యాల: కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేయాలని అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ రిటైల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఇబ్బందులు అవుతున్నాయని, నిధులు మంజూరు చేసేలా చూడాలన్నారు. నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు హరిప్రభాకర్, ప్రధాన కార్యదర్శి వేణుమాధవరావు, కోశాధికారి రాజేందర్, మహేందర్, హన్మండ్లు, మహిపాల్ పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ లీడర్‌షిప్ మెడల్ అవార్డు అందజేత

కోరుట్లటౌన్: పట్టణంలోని సాయిరాం కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కటుకం సురేందర్ లీడర్ షిప్ మెడల్ అవార్డు అందుకున్నారు. తమిళనాడు రాష్ట్రం చెన్నై సవేరా హోటల్‌లో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సమావేశంలో అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సి. బాల చంద్రన్ చేతుల మీదుగా లీడర్ షిప్ మెడల్ అవార్డు ఆదివారం అందుకున్నారు. సురేందర్‌ను పలువురు అభినందించారు.

ఉగాది పురస్కారం అందుకున్న రమేశ్‌శర్మ

రాయికల్: పట్టణంలోని పురోహితుడు రమేశ్‌శర్మ ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాన్ని నిర్వాహకులు శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు.

గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దాం

మల్లాపూర్: గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని మాజీ సర్పంచ్ సరికెల లక్ష్మి, ప్యాక్స్ వైస్ చైర్మన్ గొండ రాజేందర్ అన్నారు. మండలంలోని కుస్తాపూర్‌లో సీసీరోడ్డు నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సరికెల మహిపాల్, పాల్గొన్నారు.

తాండ్ర్యాలలో 'మన గ్రామ ఆరోగ్య సహాయనిధి' ఏర్పాటు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో 'మన గ్రామ ఆరోగ్య సహాయనిధి' కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. గ్రామస్తులు ఆదివారం గ్రామపంచాయతీలో సమావేశమయ్యారు. ఇందులో సభ్యత్వం తీసుకునేవారు రూ. 1,000 చెల్లించాలని నిర్ణయించారు. గ్రామంలో అంబులెన్స్ నిర్వాహణ, పేదలు అనారోగ్యానికి గురైతే చికిత్సలకు ఆర్థికసాయం కోసం ఈ నిధులను వినియోగించుకోవాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

కోరుట్లటౌన్: పట్టణంలోని శ్రీ మురళీకృష్ణాలయం దగ్గర శ్రీవీరబ్రహ్మేంద్ర కార్పెంటర్ ఆర్గనైజేషన్ సంఘ భవనంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం ఏర్పాటు చేసినట్లు మాజీ వార్డు కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ తెలిపారు.లయన్స్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకుంటే ఆపరేషన్లు ఉచితంగా చేస్తారని లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.